క్లుప్తంగా

ఘనంగా అన్నాభిషేకం



ప్రత్యేక అలంకరణలో త్రయంబకేశ్వరస్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని పార్వతీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణతోపాటు మహిళలు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఆలయ అర్చకుడు చైతన్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరశురామ అవతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజిత చిన్న దశవతార అలంకార ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి పరశురామవతారం దర్శనమిచ్చారు. స్వామివారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు అందజేస్తున్న విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. పేదలు, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తనకు వచ్చే పింఛను సొమ్ములో కొద్ది మొత్తం నిత్యావసర సరకులకు కేటాయిస్తున్నట్టు దాత బాపిరాజు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశు మరణాల నివారణే లక్ష్యం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని పీడియాట్రిక్స్ లెక్చర్ గ్యాలరీలో మంగళవారం జాతీయ శిశు వారోత్సవాలలో భాగంగా నవజాత శిశు సంరక్షణపై సదస్సు జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జీజీహెచ్ చంటి పిల్లల వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రి రాంబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అతిథులుగా హాజరయ్యారు. నవజాత శిశు ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు యాంటిబయాటిక్స్‌ను అవసరానికి తగినట్లు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాంబాబు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2025 నాటికి ప్రస్తుతం వెయ్యికి 18గా ఉన్న నవజాత శిశు మరణాలను 14కి తగ్గించే లక్ష్యంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పీడియాట్రిక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ డాక్టర్ మాధవి పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ విద్య, డీఐవో డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ మధన్‌మోహన్, డాక్టర్ గోపీచంద్, డాక్టర్ విజయభాస్కర్ సహా శిశువుల తల్లులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణ ఓపీ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ నివారణ(ప్రివెంటివ్ ఆంకాలజీ) ఓపీ సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. హెచ్‌వోడీ డాక్టర్ వాసస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఈ సేవలను ప్రారంభించారు.

కార్తిక అన్నదానంతో యజ్ఞయాగఫలం

బోట్‌క్లబ్: కార్తికమాసంలో నిర్వహించే అన్నదానంతో లోకకల్యాణం సిద్ధించే యజ్ఞయాగ ఫలం లభిస్తుందని గణపతి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. కాకినాడ బీచ్ రోడ్ రాజీవ్ గృహ కల్ప వద్ద విజయ కనకదుర్గ మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా కార్తిక సమారాధనగా మంగళవారం వెయ్యి మందికి భారీ అన్నదానం నిర్వహించారు. అయ్యప్పస్వాములకు భోజనాలు ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించిన దాతలను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.

కమిటీలు పేరుకేనా?

- కళాశాలల్లో విద్యార్థులపై తగ్గని వేధింపులు
- కానరాని అవగాహన సదస్సులు
- నామమాత్రంగా ర్యాగింగ్, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్
- సమర్థవంతంగా పనిచేయాలంటున్న విద్యార్థి సంఘాలు


బాలాజీచెరువు: ఇటీవల రంగరాయ వైద్య కళాశాలలో సీనియర్ విద్యార్థి జూనియర్స్‌ని చేసిన ర్యాగింగ్ కలకలం రేపింది. దీంతో విద్యార్థుల్లో భయాందోళన నెలకొంది. ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా మార్పు మాత్రం రావడం లేదు. ఏదైనా సమస్య వస్తే విద్యార్థులు ముందుగా ఏవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. విద్యా సంవత్సర ప్రారంభంలో కళాశాలలో ర్యాగింగ్, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల నివారణపై సదస్సులు ఏర్పాటు చేసి హడావుడి చేస్తారు. తర్వాత మర్చిపోతారు. రెండు నెలల తర్వాత మళ్లీ మొదలవుతుంది. అప్పుడు ఎవరూ దానిని పట్టించుకోరు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాంకేతిక వర్సిటీగా పేరొందిన జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో గత ఏడాది ఔట్‌సోర్సింగ్ ల్యాబ్ ఉద్యోగి మహిళ విద్యార్థినిపై అసభ్యకర మెసేజులతోపాటు ఇష్టమొచ్చినట్టుగా ప్రవర్తించడంతో ఆమె చివరకు తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ విషయంపై వీసీను కలవగా తక్షణం అతన్ని విధుల నుంచి తొలగించేలా ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆ విద్యార్థి గత నెల



బదిలీ, రిటైర్డ్ అయిన అధికారుల పేర్లతో ర్యాగింగ్ కమిటీ సమాచారం బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

రోజులుగా తనను ఇబ్బంది పెడుతున్నాడని, చివరకు భరించలేక ఉన్నతాధికారులకు తెలిపానని పేర్కొంది. ఈ సమస్య ఒక్క విద్యార్థిదే కాదు అటు తరగతులు, ల్యాబ్‌లో పలు విభాగాల్లో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. వారు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఎంతో ఆవేదనను అనుభవిస్తున్నారు. ఇది ఒక్క జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో కాకుండా నగరంలో ఉన్న అనేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్య ఉంది. తాజాగా రంగరాయ వైద్య కళాశాలలో ర్యాగింగ్ మరింత ఎక్కువైంది. ఎవరికి చెబితే ఏమౌతుందోనని తర్జన భర్జన పడుతున్న జూనియర్ విద్యార్థుల సమస్య తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇలా ప్రతి కళాశాలలో మహిళ విద్యార్థులు ఏదో చోట సమస్యను ఏదుర్కొంటూ ఉన్నారు.



జేఎన్‌టీయూకేలో పేరుకు మాత్రం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ బాక్సు

నామమాత్రంగా గ్రీవెన్స్ బాక్సులు

ప్రతి కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ పేరుతో సీనియర్ మహిళ అధ్యాపకులకు ప్రత్యేక గది ఏర్పాటు చేయడంతో పాటు తమ సమస్యలు నేరుగా చెప్పకుండా ఫిర్యాదు రూపంలో చెప్పి ఆ బాక్సులో వేసేలా ప్రత్యేక బాక్సు ఏర్పాటు చేశారు. ఆ బాక్సులు పేరుకు తప్ప వాటిపై అవగాహన కల్పించే వారు కానీ, వాటిని ఉపయోగించుకున్న సందర్భాలు కానీ ఎక్కడా లేవు. కొంత మంది విద్యార్థినులకైతే కనీసం వీటి కోసం తెలియకపోవడం ఆశ్చర్యం.

ఎంపవర్ కమిటీ విధి విధానాలు

ప్రతి కళాశాలలో వుమెన్ ఎంపవర్‌కమిటీ పేరుతో ముగ్గురు అధ్యాపకులతో కమిటీ ఉంటుంది. వారిలో ఒకరు కో–ఆర్డినేటర్‌గా ఇద్దరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలో ఐదారు మహిళ సదస్సులు, షీ–టీమ్స్‌తో ఇంటరాక్ట్, ర్యాలీలు, ప్రముఖులతో ఉపన్యాసాలు వంటివి నిర్వహించాలి. విద్యార్థినులకు ఏమైనా వ్యక్తిగతంగా సమస్యలు ఉంటే ఈ కమిటీ సభ్యులకు తెలియజేయవచ్చు. ర్యాగింగ్ బాధితులు అయితే ఎంపవర్‌మెంట్ సెల్ ద్వారా యాంటీ ర్యాగింగ్ కమిటీను సంప్రదించవచ్చు.

కమిటీలు సమర్థవంతంగా ఉండాలి



మహిళలకు అటు సిబ్బంది లేదా విద్యార్థినులకు ఏ విధమైన సమస్య వచ్చినా ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సమసర్థవంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలి. వర్సిటీ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ గ్రీవెన్స్ పేరుతో డైరెక్టరేట్ ఉంది. దీని ద్వారా అటు ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ కళాశాలలో విద్యార్థినులకు ఏ విధమైన సమస్య వచ్చినా పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థినులపై ఎవరు అసభ్యంగా ప్రవర్తించిన తక్షణం వారిపై చర్యలు తీసుకోవడంలో అశ్రద్ధ చూపకూడదు.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఏ సమస్య ఉన్నా చెప్పొచ్చు..



విద్యార్థులు ఏ విధమైన సమస్య ఉన్న నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే వచ్చిన ఫిర్యాదుపై కమిటీ వేసి నిర్ధారణ జరిగితే చర్యలు తప్పకుండా తీసుకుంటాం. గతంలో జరిగిన సంఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులపై ఏమైనా జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ ఎస్.మోహనరావు, ప్రిన్సిపాల్ జేఎన్‌టీయూకే

గ్రంథాలయాధికారి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోషియేషన్ సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో 31 గ్రంథాలయాధికారుల పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని, త్వరగా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని గోదావరి లేబ్రేరీ అసోషియేషన్ ఉమ్మడి జిల్లా సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ ప్రసాద్‌కు మంగళవారం ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. న్యాయ స్థాన పరిధిలో ఉన్న 31 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపడం సంతోషమని, పై అధికారులతో చర్చించి పోస్టుల భర్తీ కోసం చర్యలు తీసుకుని లైబ్రేరీ సైన్స్ కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో తమ సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, అవసరమైన మేరకు సంఘ సభ్యులు సహకారం అందజేస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోదావరి లైబ్రేరీసైన్స్ అసోషియేషన్ కార్యదర్శి కొక్కెరమెట్ల సాయిబాబా, కోశాధికారి ఆచార్యులు, సభ్యులు తమ్మారావు, రవిశంకర్ ఉన్నారు.

బాలల రక్షణపై అవగాహన అవసరం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ట్రైనీ కలెక్టరు భావన

కాకినాడ రూరల్: బాలల రక్షణకు సంబంధించి నూరు శాతం అవగాహన పెంపొందించుకోవాలని స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ(ఐసీడీఎస్) సిబ్బందిని ట్రైనీ కలెక్టరు భావన కోరారు. రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ పీడీ ప్రవీణ ఆధ్వర్యంలో నూరు శాతం చైల్డ్ సేఫ్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రైనీ కలెక్టరు భావన, ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ సూర్య ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. వీరంతా పిల్లలకు సంబంధించి చట్టాలు, వాటి సెక్షన్లు, పోస్కో చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్: శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి ఫౌండేషన్ డే, ఆ సంస్థ వ్యవస్థాపకుడు సంకురాత్రి చంద్రశేఖర్ పుట్టిన రోజును పురస్కరించుకుని పెనుమర్తి గ్రామం వద్ద మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. కిరణ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, శారద విద్యాలయ సిబ్బంది, ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు ఈ రక్తదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపేందుకు కిరణ్ కంటి ఆస్పత్రిని స్థాపించామని అనుకున్న లక్ష్యం సాధించడంతో ఎంతో ఉత్సాహం ఉందన్నారు. రక్తదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్



రక్తదానం చేస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టరు చంద్రశేఖర్

వైస్ చైర్మన్ వైడీ రామారావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టరు కామరాజు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, జ్యోతుల శ్రీనివాస్, చెల్లా లక్ష్మి, మురాలశెటి సునీల్, బొజ్జా రాంప్రసాద్, సంకురాత్రి ఫౌండేషన్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు జీవీ రావు, మెడికల్ డైరెక్టరు డాక్టరు అవినాష్ మహేంద్రకర్, ఔట్‌రీచ్ మేనేజరు పెదిరెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వుమెన్ కబడ్డీ పోటీల్లో జేఎన్‌టీయూకే విద్యార్థినుల ప్రతిభ



కబడ్డీ పోటీల విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్ రావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రకాశం జిల్లా రైస్ కృష్ణసాయి ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల వుమెన్ కబడ్డీ పోటీల్లో జేఎన్‌టీయూకే విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో 20 కళాశాలలకు చెందిన జట్లు పాల్గొనగా జేఎన్‌టీయూకే విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు, పీడీ శ్యామ్‌కుమార్ మంగళవారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో అభినందించారు.

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

కరప: ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన లబ్ధిదారులు గృహనిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు సూచించారు. కరపలోని సెంట్రల్ లేఅవుట్‌లోని జగనన్న హౌసింగ్ కాలనీలో మంగళవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంతవరకూ గృహనిర్మాణాలు చేపట్టని వారందరూ డిసెంబర్ నెలాఖరుకల్లా పనులు ప్రారంభించాలని, వివిధ దశల్లో నిర్మాణాలలో ఉన్న గృహాలను మార్చినెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఇళ్ల స్థలాలిచ్చి, హౌసింగ్‌లోన్లు మంజూరు చేశారని, కాలనీలోకి వచ్చే రహదారి సక్రమంగా లేక రాకపోకలు సాగించేందుకు, హౌసింగ్ మెటీరియల్ తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని, సీసీ రోడ్డుకానీ, బీటీ రోడ్డుకానీ వేయాలని జగనన్న హౌసింగ్ కాలనీ వాలు కోరారు. వర్షం వస్తే కాలనీ పూర్తిగా ముంపునకు గురవుతుందని, ఇళ్లకు తాళాలు వేసుకుని బయటకు పోవాల్సివస్తోందని లబ్ధిదారులు తమ బాధలను అధికారులకు ఏకరువు పెట్టారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు స్పందించి కరప సెంట్రల్ లేఅవుట్‌లోని లబ్ధిదారుల సమస్యలను, రోడ్డు నిర్మాణం గురించి కలెక్టర్‌కు వివరిస్తామని తెలిపి, గృహనిర్మాణాలు గడువులోగా పూర్తిచేయాలన్నారు. అనంతరం అధికారులు పెనుగుదురు, కొరిపల్లి, జెడ్.భావారం తదితర గ్రామాల్లో పర్యటించి గృహనిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, హౌసింగ్ ఏఈఈ పెండెం నాగేష్, ఏపీఓ జీవీ రమణకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కరపలోని జగనన్న హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులకు సూచనలిస్తున్న అధికారులు

లోకంలో శాంతి నెలకొల్పాలన్నదే బ్రహ్మకుమారీల లక్ష్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి రమాదేవి

బోట్‌క్లబ్: శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మనస్సుకు కూడా అంతే అవసరమని బ్రహ్మ కుమారి రమాదేవి పేర్కొన్నారు. కార్తిక మాసం సందర్భంగా మంగళవారం కాకినాడ రాజాజీ వీధిలో ఉన్న బ్రహ్మకుమారి భవనంలో మీడియా మిత్రులతో ఆధ్యాత్మిక, ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మన దేశం ఒక ఆధ్యాత్మిక శక్తని కొనియాడారు. నైతిక విలువలను పెంపొందించి అందరి జీవితాలలో సుఖశాంతులను నెలకొల్పాలన్నదే బ్రహ్మకుమారిల లక్ష్యమన్నారు. ఈ నెల 21న బంగారు రథంపై సోమనాథేశ్వరుడు కాకినాడ నగరంలో పలు వీధుల్లో శోభాయాత్ర ఉంటుందన్నారు. బ్రహ్మ కుమారీస్ విశ్వ విద్యాలయంలో మమేకమై అక్కడ జరగుతున్న మంచిని సమాజానికి తెలియచెజేయాలని కోరారు. అనంతరం ఒత్తిడిని ఎలా అధిగమించాలని రమాదేవి హితోపదేశం చేశారు. ఈ సమావేశంలో బీకే రజనీ, రామేశ్వరి, మీరా, లక్ష్మి, గంగ, పద్మ, పాపారావు, నాగబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

బోట్‌క్లబ్: నిరుపేద విద్యార్థులకు పైడా వెంకటనారాయణ సుశీల రాఘవరత్నమ్మ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఎప్పుడూ అండగా నిలుస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు పైడా రామకృష్ణ అన్నారు. స్థానిక మధురానగర్‌లోని ప్రజావిద్యాలయంలో ఉచిత విద్య అందిస్తున్న స్కూల్‌ను ట్రస్ట్ సభ్యులు మంగళవారం సందర్శించి విద్యార్థులకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు అందించారు. ప్రజా విద్యాలయం అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. తమ ట్రస్ట్ తరపున ప్రజా విద్యాలయానికి అండగా ఉంటామన్నారు. ట్రస్ట్ సభ్యులు పైడా వెంకటనారాయణ మాట్లాడుతూ తమ ట్రస్ట్ విద్యార్థులకు ఎప్పుడూ అండగా నిలుస్తుదన్నారు. ఇటీవల తమ ట్రస్ట్ ద్వారా పీఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు రూ.50 లక్షలతో భవనాలు నిర్మించి ఇచ్చామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో అనుకున్నది సాధించాలని ఆకాంక్షించారు. ప్రజావిద్యాలయం కరస్పాండెంట్ వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ పైడా ట్రస్ట్ గతంలో తమ సంస్థకు ఎంతగానో సహకారం అందించారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తున్న పైడా అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు

యాంటీబయాటిక్స్ దుష్ప్రభావంపై అవగాహన ర్యాలీ



జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల ర్యాలీ

కాకినాడ క్రైం: వైద్యుడి సూచన లేకుండా యాంటిబయాటిక్స్ వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రస్తావిస్తూ నర్సింగ్ విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 18న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈ ర్యాలీ జరిగింది. మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి మంగళవారం ఆసుపత్రిలో పోర్టికో వద్ద ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ కొనసాగింది. యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులు నినదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్య చంద్రిక వెన్న సహా మైక్రోబయాలజీ వైద్య నిపుణులు, జీజీహెచ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ బోధకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం



కరపలో సత్కరించిన పారిశుధ్యకార్మికులతో అధికారులు

కరప: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, సోషల్ వెల్ఫేర్‌శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు, స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైన్లలో మురికినీరు పోయేలా పూడిక తొలగించాలన్నారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. వరల్డ్ టాయిలెట్స్ డే గురించి వివరించారు. ఈసందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ అనుపమ, గ్రామకార్యదర్శి యు.నిర్మలాదేవి సత్కరించి, పండ్లు, స్వీట్లు అందజేశారు.

ఆలయ భూముల ఆక్రమణలు తొలగించాలి

కరప: ఉప్పలంకలో కాలభైరవ స్వామిక ఆలయానికి దాత ఇచ్చిన రెండు ఎకరాలు భూమి ఆక్రమణలకు గురైందని, విచారణ జరిపి సదరు ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామ సర్పంచ్ బొమ్మిడి నయోమి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె ఉప్పలంక వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్‌తో కలిసి ఆక్రమణలపై తహసీల్దార్ ఎస్.సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కాలభైరవ స్వామి గుడి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆస్వామి భక్తుడు కీర్తిశేషులు కాలెపు ఆనందరావు సర్వే నంబర్ 106/1ఏలో 2 ఎకరాలు భూమిని రాసిచ్చారు. ఇందులో మూడు వంతులకు పైగా ఆక్రమణలకు గురైంది. ఆక్రమణదారులు సదరు స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే జరిపి, ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడాలని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సతీష్ కోరారు. ఉప్పలంక గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2005–2009 లో చేసిన పనులకు, చెల్లించిన వేతనాల్లో అక్రమాలు జరిగాయి. సదరు అక్రమాలపై విచారణ జరపాలని గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని సతీష్ తెలిపారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై, చెల్లింపులపై విచారణ చేయాలని కోరుతూ ఎంపీడీఓ ఎం.అనుపమకు వినతిపత్రం ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

లౌకికవాదానికి తూట్లు

కాకినాడ క్రైం: దేవాలయాల వద్ద హిందువులు, మసీదుల వద్ద ముస్లింలు, చర్చిల వద్ద క్రైస్తవులు మాత్రమే వ్యాపారాలు చేయాలనే ఆంక్షలు తీవ్ర అభ్యంతకరమని సామాజిక వేత్త ధూసర్లపూడి రమణ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ నూతన పాలకవర్గం తీసుకుంటున్న నిర్ణయాలను ఎండగట్టారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేల ఉన్న పాలక వర్గ నిర్ణయాలు లౌకిక వాదానికి తూట్లు పొడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన ఆలయాల వద్ద చిరువ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారాన్ని పోగొట్టి పేదల పొట్టకొట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మత ప్రమేయం లేని విధంగా ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఎండోమెంట్, వక్ఫ్ బోర్డ్, మిషనరీలలో మత ప్రస్తావనలు లేని నియామకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



వేళంగి లైబ్రరీలో ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, లైబ్రేరియన్

గ్రంథాలయంలో ఇందిరా గాంధీకి ఘన నివాళి

కరప: వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని లైబ్రేరియన్ పాట్నీడి వెంకట రంగయ్య అన్నారు. మంగళవారం వేళంగిలోని శాఖాగ్రంథాలయంలో ఆయన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చించారు. కరప లైబ్రరీలో కూడా రికార్డు అసిస్టెంట్ ఎస్‌వీఎస్ ఫణీంద్ర, పాఠకులు, విద్యార్థులతో కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు.

బాలాజీచెరువు: స్థానిక మెయిన్‌రోడ్ గ్రంథాలయ శాఖలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ ఏవీఎస్ సుబ్బలక్ష్మి హాజరై మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా ముఖ్యమైందని, తల్లి, చెల్లి, భార్య ఇలా అనేక పాత్రలు పోషిస్తూ బాధ్యతగా ఉంటుందన్నారు.అనంతరం మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కిశోర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, రవికుమార్, వీర్రాజు పాల్గొన్నారు. రామకృష్ణారావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సాంబమూర్తినగర్ మహర్షి దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ హాజరై ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు వివరించారు. బ్యాంకులు జాతీయకరణం వంటి గుర్తిండిపోయే కార్యక్రమాలు చేపట్టి దేశ ప్రజల మన్నలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబ్రేరియన్ రమేష్,పాఠకులు పాల్గొన్నారు.



మెయిన్‌రోడ్ గ్రంథాలయంలో మహిళలను సత్కరించిన దృశ్యం

సంజీవ్ కళాశాలలో..

సంజీవ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో డైరెక్టర్ సంజీవ్ హాజరై దేశ భవిష్యత్‌లో మహిళల పాత్ర గురించి విద్యార్థులకు ఉపన్యాసం ఇచ్చారు. నేటి కాలంలో మహిళలు, వారికి ఉన్న అవకాశాలు వివరించి వారికి దిశా–నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఏవో సుధాకర్, ప్రియాంక పాల్గొన్నారు.